# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 10-05-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **పాకిస్థాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ త్రివిధ దళాల అధిపతులతో సమావేశమై తాజా పరిస్థితిని సమీక్షించారు.**

2. **సరిహద్దు రాష్ట్రాల్లో నివాసం ఉంటున్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రజలకు సహాయ, సహకారాలు అందించడానికి ఢిల్లీలోని ఏపీ భవన్, తెలంగాణ భవన్‌లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటుచేశారు.**

3. **హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు ద్వారా జూలై 10వ తేదీన నీటిని విడుదల చేస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.**

4. **ఉగ్రవాదంపై పోరాటంలో మన దేశ సాయుధ బలగాలకు అండగా నిలిచేందుకు జాతీయ రక్షణ నిధికి తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తన ఒక నెల వేతనాన్ని విరాళంగా ప్రకటించారు.**

5. **ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని కోరుతూ దేశంలోని ప్రముఖ ఆలయాల్లో పూజలు నిర్వహించన్నామని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ తెలిపారు.**

==========================

పాకిస్థాన్ మరోసారి మన దేశంపై దాడులకు విఫలయత్నం చేసింది. నిన్న రాత్రి బారాముల్లా నుంచి భుజ్ వరకు 26 ప్రాంతాలపై వరుస డ్రోన్ల దాడులకు ప్రయత్నించింది. ముఖ్యంగా శ్రీనగర్ విమానాశ్రయాన్ని, అవంతీపోరా వైమానిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుని పంపిన డ్రోన్లను భారత సైన్యం విజయవంతంగా నిర్వీర్యం చేశాయి. మరోవైపు.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ త్రివిధ దళాల అధిపతులతో నిన్న రాత్రి ఢిల్లీలో సమావేశమై తాజా పరిస్థితిని సమీక్షించారు. సరిహద్దు రాష్ట్రాలైన రాజస్థాన్, గుజరాత్, పంజాబ్ ముఖ్యమంత్రులతో ఫోన్‌లో నరేంద్ర మోదీ మాట్లాడారు. త్రివిధ దళాల మాజీ అధిపతులతో సహా పలువురితో ఆయన సమావేశమై చర్చించారు. ఉద్రిక్తతలు కొనసాగుతున్న క్రమంలో పాకిస్థాన్ సరిహద్దు రాష్ట్రాలు అప్రమత్తమై, ముందస్తు చర్యలు చేపట్టాయి.

--------------------------

భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అప్రమత్తం చేసింది. పౌర రక్షణ చట్టం -1968 ప్రకారం పౌర రక్షణ చర్యలను పెంచాలని కోరింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు లేఖలు రాసింది. 1968 సివిల్ డిఫెన్స్ చట్టంలోని సెక్షన్ 11ను ఉపయోగించాలని సూచించింది. ఈ సెక్షన్ ప్రకారం అత్యవసర సామగ్రిని

కొనేందుకు పౌర రక్షణ అధికారులకు అత్యవసర సేకరణ అధికారాన్ని ఇవ్వాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ లేఖలో పేర్కొంది.

---------------------------

పాకిస్థాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో సరిహద్దు రాష్ట్రాల్లో నివాసం ఉంటున్న ఆంధ్రప్రదేశ్ ప్రజలకు అవసరమైన సహాయ, సహకారాలు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో కంట్రోల్ రూం ఏర్పాటుచేసింది. సాయం అవసరమైనవారు 011-23387089, 9871999430, 9871999053 నంబర్లలో ఎప్పుడైనా సంప్రదించవచ్చని రెసిడెంట్ కమిషనర్ సూచించారు. అటు.. తెలంగాణ ప్రభుత్వం కూడా ఢిల్లీలోని తెలంగాణ భవన్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసింది. సరిహద్దు రాష్ట్రాల్లో నివసిస్తున్న, పర్యటిస్తున్న తెలంగాణ ప్రజలకు ఏదైనా సహాయం అవసరమైతే 011-23380556, 98719 99044, 99493 51270 నంబర్లకు ఫోన్ చేయొచ్చని రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ సూచించారు.

---------------------------

రాయలసీమ ప్రాంతానికి జీవనాడి అయిన హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు ద్వారా జూలై 10వ తేదీన నీటిని విడుదల చేస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలం చాయాపురంలో హంద్రీనీవా పనులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రాజెక్టులో మొదటి, రెండవ దశల్లో చేపడుతున్న 554 కిలోమీటర్ల కాలువ లైనింగ్, వెడల్పు పనుల కోసం ప్రభుత్వం 3 వేల 873 కోట్లు ఖర్చు చేస్తోందని వెల్లడించారు. 5 నెలల్లో పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించామని.. వచ్చే నెలాఖరుకు మొదటి దశ పనులు పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి వివరిస్తూ...

..వాయిస్.. 31 సెకన్లు

---------------------------

భారత్- పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో.. బ్యాంకులు అప్రమత్తంగా ఉండాలని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు. వినియోగదారులు, వ్యాపారాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బంది కలగకుండా చూడాలని, అంతరాయం లేని సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సైబర్ భద్రత సన్నద్ధతపై బ్యాంకులు, ఆర్బీఐ, ఎన్‌పీసీఐ, బీమా సంస్థల ఉన్నతాధికారులతో నిర్వహించిన సమావేశంలో నిర్మలా సీతారామన్ ఈ మేరకు సూచనలు చేశారు.

---------------------------

జాతీయ రక్షణ నిధికి తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తన ఒక నెల వేతనాన్ని విరాళంగా ప్రకటించారు. మన దేశ సాయుధ దళాలు ఉగ్రవాదాన్ని తుడిచిపెట్టడానికి చేస్తున్న ప్రయత్నానికి భారతీయుడిగా గర్విస్తున్నానని.. సైనికుల పోరాటానికి తన వంతుగా ఒక నెల వేతనాన్ని విరాళంగా ఇవ్వాలని నిర్ణయించుకున్నానని ఆయన పేర్కొన్నారు. సహ ప్రజాప్రతినిధులు, పార్టీ సహచరులు, పౌరులందరూ కూడా జాతీయ రక్షణ నిధికి విరాళాలు ఇవ్వాలని రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా దేశ భద్రతకు అంకితమైన సైనిక బలగాలకు అండగా నిలిచేందుకు తమ ఒక్క రోజు వేతనాన్ని విరాళంగా ఇస్తున్నామని తెలంగాణ రాష్ట్ర సివిల్ సర్వీసెస్ డిప్యూటీ కలెక్టర్ల సంఘం ప్రకటించింది.

---------------------------

ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని కోరుతూ దేశంలోని ప్రముఖ ఆలయాల్లో పూజలు నిర్వహించన్నామని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ తెలిపారు. పాకిస్థాన్‌తో చేస్తున్న ధర్మ యుద్ధానికి ప్రతి ఒక్కరి నైతిక మద్దతు అవసరమని.. అదే సమయంలో దైవబలం ఆశీస్సుల కోసం ప్రార్థించాలని ఆయన కోరారు. మన త్రివిధ దళాల క్షేమం కోసం జనసేన పార్టీ తరఫున మంగళవారం ఉదయం తమిళనాడులోని ప్రముఖ ఆలయాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు చేయించాలని పార్టీ నేతలకు పవన్ కల్యాణ్ సూచించారు.

--------------------------

'ఆపరేషన్ సిందూర్'లో పాకిస్థాన్‌తో పోరాడుతూ వీర మరణం పొందిన ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన మురళీనాయక్ తల్లిదండ్రులను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పరామర్శించారు. నిన్న గోరంట్ల మండలం, కళ్ల తండాలోని వారి నివాసానికి వెళ్లిన మంత్రి తనవంతు సాయంగా 5 లక్షల రూపాయల చెక్కు అందజేశారు. యువతకు స్ఫూర్తినిచ్చేలా తండాలో మురళీనాయక్ విగ్రహం ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తప్పకుండా ఆదుకుంటాయని మంత్రి సవిత పేర్కొంటూ..

వాయిస్ .. 28 సెకన్లు

--------------------------

ఉద్రిక్తతల నేపథ్యంలో ఉత్తర, పశ్చిమ భారత దేశంలోని పలు విమానాశ్రయాలను ఈ నెల 15 వరకు మూసివేయనున్నారు. శ్రీనగర్, చండీగఢ్ సహా మొత్తం 24 విమానాశ్రయాల్లో పౌర విమానాల రాకపోకలను నిలిపివేశారు. ఈ నిర్ణయం కారణంగా ఆయా విమానాశ్రయాలకు రాకపోకలు రద్దు చేశామని విమానయాన సంస్థలు ప్రకటించాయి. ఈ క్రమంలోనే జమ్మూ, చండీగఢ్‌లో చిక్కుకున్న విమాన ప్రయాణికుల కోసం రైల్వేశాఖ 4 ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసింది.

--------------------------

సంప్రదాయేతర ఇంధన వనరుల్లోనూ సింగరేణి సంస్థ మెరుగైన పనితీరు కనబరచాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. సింగరేణి భవిష్యత్తు విస్తరణ ప్రాజెక్టులపై సచివాలయంలో నిన్న ఆయన సమీక్ష నిర్వహించారు. కొత్త ఖనిజాల అన్వేషణలో అనుభవజ్ఞులైన అధికారుల ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదే విధంగా రాజీవ్ యువవికాసం పథకం కింద లబ్ధిదారుల ఎంపిక పూర్తిచేసి, జూన్ 2వ తేదీ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంజూరు పత్రాల పంపిణీకి ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను భట్టి విక్రమార్క ఆదేశించారు.

--------------------------

వాయవ్య భారతం నుంచి పొడిగాలులు వీస్తుండడంతో ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో ఎండ తీవ్రత పెరిగింది. ఎండ తీవ్రతతో వాతావరణ అనిశ్చితి నెలకొనడంతో పలు ప్రాంతాల్లో ఈదురుగాలులు, పిడుగులతో వర్షం కురిసింది. కాగా.. రాబోయే 24 గంటల్లో కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని, మిగిలిన ప్రాంతాల్లో ఎండ తీవ్రత కొనసాగుతుందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

=====================